# అతని పండగ

[ చిన్న కథ ]

'గ్రహణదినములే తనకు పండగలు వాళ్లు ఏడవనీ, మైలపట్టనీ, బాధపడనీ తనుమాత్రం ఆరోజున పండగ అనుభవిస్తాడు.'

రచయిత:

## జనస్వామి కోదండరామశాస్త్రి

'వెంకూ! వెంకూ!' అని పిలుస్తూ వెంకటేశ్వర్లగది తలుపు తట్టాడు సుదర్శనరావు.

వులికిపడి నిద్రలేచి కళ్లు నలుపుకుంటూవచ్చి వెంకటేశ్వర్లు తలుపుతీశాడు. సుదర్శన్ లోపలకు వచ్చాడు.

'ఏరా సుదర్శన్! మీరాణీగారు ఇంకా జట్కాబండీలో వెళుతోంది ఎక్కడికి?' అని అడిగాడు వెంకటేశ్వర్లు.

'మా అత్తవారింటికి రా. రేపు సంక్రాంతిపండుగకదూ?'

'పండగ' అన్న మూడక్షరాలూ వినిపింపగానే అతనిముఖం కళావిహీనమైంది. నేత్రముల్లో విషాదచ్ఛాయలు పొడసూపినై. సుదర్శన్ ఏమిటేమిటో మాట్లాడుతున్నాడు. ఏమేమో చెపుతూన్నాడు.

ఏవేవో విశేషాలు చెప్పిచెప్పి సుదర్శన్‌కి విసుగెత్తుతోంది. యీ మాటల్లో ఒక్కదానికైనా వెంకటేశ్వర్లు వద్దనుంచి ఏవిధమైన జవాబూ లేదాయె! 'పండగ' అనే యీమూడక్షరాలూ వెంకటేశ్వర్ల మెదడ్ని కటకటా నలిపేస్తున్నాయి. సుదర్శన్ నిరుత్సాహియై 'వెళుతున్నారా వెంకూ' అని అంటూ లేచి నిలబడ్డాడు. అప్పుడుకూడా వెంకటేశ్వర్లు నోరుతెరిచి 'వెలుదువుగాని లేరా' అని అన్నా అన్నట్లయితే, సుదర్శన్‌కి యింకోగంటపాటు బాతాఖాని కొట్టడానికి అవకాశం కలిగేదే! అప్పటికీ అమాట అనికూడా ఓ అయిదు నిముసాలు అల్లాగే నిల్చొని వున్నాడు. వెంకటేశ్వర్లు అతనివంకయినా చూడటం లేదు. 'ఇక యిక్కడలాభంలేదు. అటు క్లబ్బుకైనా వెళితే ఓగంటసేపు బాతాఖానికి వీలుంటుంది' అనుకుంటూ సుదర్శన్ మెల్లిగా బయటకు జారుకున్నాడు.

వెంకటేశ్వర్లు తలుపులుమూసుకుని నీరసంగా మంచంపై వాలాడు.

తనుఒక్కడు — యీ ప్రపంచంలో తనకు తను ఒక్కడే. తన సహృదయాన్ని చూచిమెచ్చుకుని దేవుడిచ్చిన వరమేమో తనకీ ఒంటరిబ్రతుకు!

పండగ...

తనకో పండగ...

పండగ అనేది లేకండా యీ ప్రపంచంలో ఎన్నడు నశించిపోతుందో, తన హృదయానికి అప్పుడు శాంతి చిక్కుతుంది.

ఈ ప్రజలు పండగలని అనుకుని ఆనందించేరోజులన్నీ తనకు పండుగలుకావు. తన కొంపకూల్చిన దుర్మార్గపుశక్తులు. తన జీవితపతనానికి కారణమైన పిశాచకారులు. 'పండగ' అన్న యీ మూడక్షరాలూ వినిపించగానే తనహృదయం యింత ఎక్కువగా దద్దరిల్లిపోతుందేమిటీ?

భయం. హడల్. పెద్దపులి తనపై దూకపోతున్నపుడు కూడా తన హృదయం అంతగా భీతిల్లదేమో! తనని మినహాయించి యీ ప్రజనంతటినీ ఆనంద తరంగములలో ఉయ్యాలలూగించే యీ పండగలు తన బ్రతుకులో భగభగ మంటల్ని ఎందుకు రగుల్కొల్పుతున్నవో?

తనూ మానవుడే నే. జీవితాన్ని మొదటినుంచీ తను సన్మార్గంలో నే గడుపుకుంటూ వస్తున్నాడే. ఇప్పటికీ తనలోని దైవభక్తి వీసంపాలుకూడా తరగలేదే.

అయినప్పుడూ, అందరూ ఆనందించే యీ పండగలు తనజీవితానికి 'భగభగ మంట'లుగా ఎందుకు కావాలీ? రేపటి రోజున సంక్రాంతిపండుగా ... సంక్రాంతి ... మకర సంక్రాంతి ... పితృదేవతలకు నీరువదలడానికి యోగ్యమైన

పర్వదినం...అల్లుళ్లు తమ అత్తింటికానుకల్నూ, ఆడపడుచులు తమ పుట్టింటి కానుకల్నూ అందుకుని సంతృప్తిపూరిత హృదయాలతో ఆయావంశముల జయము కోరుతూ శుభాశీస్సులు కురిపించే శుభదినం... కాని తనకో...చేతి కందొచ్చిన తన ఏకైకపుత్రరత్నాన్ని బలితీసుకున్న దయాదాక్షిణ్యాలు లేని కర్కోటకపురోజు. తన వంశపు నాశనాన్ని కోరిన అశుభదినం...

దీనివలెనే అదిగూడా ఏదో పెద్ద పండగ అంటారే — అవును సంవత్సరాది...వసంతలక్ష్మికి కర్పూరహారతులతో సుస్వాగతమునిచ్చే పవిత్రదేవతాకన్య...ఆసమయం.

బరువెక్కువైపోయి నడుములు ఒంగి అలసిపోతోన్న వృక్షరాజాలకు దాహము తీరుస్తూ, వాటి శ్రమనంతనీ చేతులతో తీసివేసి ప్రాణదాన మొసగే దయామయి...ఆ సంవత్సరారంభదినం. కాని తనకో... తనకు అత్యంత ప్రియమైన భార్యను పొట్టన పెట్టుకున్న...

అవును...అదీ పెద్దపండగే...విజయదశమి...ఆకాళికాదేవి మహిషాసురుణ్ణి హతమార్చిన మాట ఏమోగాని... సద్గుణ సంపన్నయైన కాపురంచేసే తన ఏకపుత్రికారత్నాన్ని మాత్రం పరలోకానికి పంపింది...పిన్నల హృదయాల్ని అమితోత్సాహంతో నింపుతూ, పెద్దల కాహ్లాదమును కూరుస్తూ, సుందరంగా తాండవించే ఆదసరా తనలోని కడుపుమంటని రెట్టింపుచేసింది.

దీపావళి ... దీపావళో ... నూత్న వస్త్రాలంకారులై మురిసిపోయే ప్రజలకు...వెలుగు కాగడాలు చేతికిచ్చి... 'ఓ భూదేవీ? ఇదే నీకు నీరాంజనం. మమ్ము సర్వ అశుభములనుంచీ కాపాడుమా!' అని మానవులచే భూదేవిని ప్రార్థింప చేస్తున్నదా అనిపించే దీపావళి, 'నా' అన్నవారందరూ గతించిపోగా మిగిలిన తన ముసలితల్లిని కాస్తా, ఆ కాగడామంటలతో కాల్చేసింది.

ఓ...తను మర్చిపోయాడు. ఆశివరాత్రో...తనుమాత్రం ఎందుకు జారుకోవాలని కాబోలు...తన ఆస్థినంతనీ కోట్టుకు వేలానికెక్కించి...తన నెత్తిపై దరిద్రదద్దమ్మను ప్రతిష్ఠాపనచేసిన...

ఇవి తనకు పండగలా? గుండెల్లో రగిలే నిప్పుకణాలు కాని...

తనకు నిజంగా... పండగ... గ్రహణపురోజున. సూర్యచంద్రాదులు సర్పం నోట్లోపడి నలిగిపోతున్నారని యీప్రజలందరూ ఏడుస్తారు. మైల అంటారు. స్నానాలు చేస్తారు... కాని తనకు అదే శుభదినం...మహాపర్వం. నిబిడాంధకారమైవున్న తన జీవితాకాశంలో ఒక కాంతి కిరణాన్ని ప్రసరింపచేసింది ఆ దినం...విషాద పీడితమైన తన హృదయానికి ఒక ఆనంద తరంగమును రుచి చూపింది ఆగ్రహణదినం. కటకటలాడే తన ఆకలిమంటల్ని శాంతింపచేసింది— యీపాతిక రూపాయల వుద్యోగానికీ దారిచూపింది.

గ్రహణదినములే తనకు పండగలు. వాళ్లు ఏడవనీ, మైలపట్టనీ, బాధపడనీ తనుమాత్రం ఆరోజున 'పండగ' అనుభవిస్తాడు.

* * *

తెల్లవారింది. నిద్రలేచి, ముఖప్రక్షాళన చేసుకుని బయటి అరుగుమీద కొచ్చాడు అతను. పారమార్థిక చింతాపరులు కృష్ణానదిలో స్నానంచేసి, నీరు పిండిన గుడ్డలు చుట్టుకుని అతని ముందుగా పోతున్నారు. వారిలో ఒకరైన సుదర్శన్ అటునుంచి వెళుతూ 'ఏరా వెంకూ? మహత్తరమైన పర్వదినంకదా? ఇవ్వాళ అయినా ఆ కృష్ణకు ఏడవకూడదూ?' అన్నాడు. అతనికి శరీరంపై కారం చల్లినట్లయింది. 'ఛస్. నేను ఏడిచేరోజులు వీళ్ళకందరికీ పర్వాలూ, పండగలూనూ. నాపండగరోజులు వీళ్ళకి ఏడిచేరోజులు. వెధవాయిలు.' అని కొరకొరా చూస్తూ లోపలకెళ్ళి తలుపు రెక్కలు మూసేశాడు.

మధ్యాహ్నం మూడుగంటలకు ... మళ్ళీ సుదర్శనం తయారు. బాతాఖానీ ఉపన్యాసం ఆరంభమైంది...మకర సంక్రాంతి ప్రశస్తతనుగూర్చి ఒక చిన్న లెక్చర్ మొదలెట్టాడు.

'పండగ' అన్న మాటుచ్చరాలూ వినిపించగానే వెంకటేశ్వర్లు కళ్లెఱ్ఱచేసి 'ఒరేయ్? నీ వెధవ వుపన్యాసాలూ, తెతతెత సారకాయకోతలూ ఆపుచేసి బయటికి నడుస్తావా? లేకపోతే లంపకాయ కొట్టమన్నావా?' అన్నాడు గాంభీర్యంగా.



సుదర్శనం గాభరాపడుతూ బయట కెళ్ళిపోయాడు.

పండగ—తన కొంపకూల్చేసిన నాశనకారి. తన వంశాన్ని మాడ్చేసిన అగ్నిగుండం. తలుపులేసుకుని తను లోపల కూర్చున్నా ఆ మూడక్షరాలూ తనకు వినిపిస్తూనే వున్నాయి.

ఆమాట వినపడకుండా కాస్సేపు అక్కడా, అక్కడా తిరిగివస్తే ... బయల్దేరాడు. తల ఒంచుకుని నడుస్తున్నాడు. కొంచెం దూరం సాగి వెళ్ళిన తర్వాత......ఆ పెద్ద మేడలోనుంచి పకపక నవ్వులధ్వని. బిగ్గఱగా మాటలు 'ఇవ్వాళ్ళ పండగ కాదుటోయ్. కాసేపు హాస్యానికి'.

గబగబా నడిచి వెళుతూన్నప్పటికీ వేంకటేశ్వర్లకు ఆ మాటలు స్పష్టంగానే వినిపించినై. 'ఛస్' అని పళ్ళు పటపటా కొరుక్కున్నాడు. ఇంకా కొంచెందూరం ముందుకెళ్ళేసరికి ... ఇద్దరు పడుచులు... ఎదుటివైపునుంచి నడిచి వస్తున్నారు. ఒకయువతి అంటోంది మరొకావిడతో 'సుమతీ! పండక్కి యీచీర పెట్టారు మానాన్న గారు.'

'ఛస్. పాడురోద' అని చీకాకుతో గొణుక్కుంటూ నడకవేగం హెచ్చించాడు వెంకటేశ్వర్లు, అతను అల్లా గొణుక్కుంటూ పోవడం ఆ యువతులు గమనించారు. 'పిచ్చివాడు గావోనే' అని నవ్వుకున్నారు.

దారిపొడుగూనా 'పండగ' అన్న మూడక్షరాలూ అతినికి వినిపిస్తూనే వున్నాయి. నూత్న వస్త్రాలంకారులగు యువతీయువకులు ఎందరో అతనికి ఎదురవుతూనే వున్నారు. గుండెల్లోనిచిచ్చు అతన్ని భస్మీపటలం చేస్తూనేవుంది.

రైల్వేస్టేషన్‌కి వెళ్ళాడు. అక్కడా ఇంతే. అణాయిచ్చి టికెట్ తీసుకుని ప్లాట్‌ఫారంమీదకు వెళ్ళాడు. అక్కడ కూడా మెరుగేమీ కన్పించలేదు.

అతని కొక మంచి ఆలోచనతట్టింది. దూరంగా కన్పిస్తోన్న ఆ రెల్లుదుబ్బుల్లోకి వెళ్ళి పొద్దూకేవరకూ కూర్చునివస్తే ఏ చికాకూ వుండదనుకున్నాడు. వెంటనే బయల్దేరాడు. రెల్లుదుబ్బులు బాగా ఎత్తుగా పెరిగివున్న ప్రదేశంలో కూర్చున్నాడు. అచటి నిర్మల ప్రశాంత వాతావరణం అతన్ని అమితోత్సాహంతో


స్త్రీలకు శిరోజములే అందము

జేమ్సు

కోకోనట్ ఆయిల్



శిరస్సునకు హానిచేయు సెంటు, ఆల్కాహాలుతో చేరిన హేరాయిలు వాడుటకంటె నిజముగా శుభ్రపరచిన కొబ్బరునూనె వాడిన మెదడును ప్రశాంతముగానుంచి శిరోజములను పెంచును.

మాజేమ్సు కోకోనట్ ఆయిలు అసలు కొబ్బరినూనెలోని మలినపదార్థములనుతీసి నవీనపద్ధతులతో శుభ్రము చేయబడినది.

ఇందులో - మల్లి - గులాబి, వగైరా సువాసనలు దొరుకును.




జేమ్సు ఫర్‌ఫ్యూమరీ కంపెనీ, మద్రాసు.

నింపుతోంది. కొంచెం దూరంగా, రెల్లుదుబ్బులసందుల్లోనుంచి కనిపిస్తోన్న కాలవలోని నీరు, ఆ యిరుకుసందులో చోటులేక వుక్కిరిబిక్కిరివి సుడులు తిరుగుతూ, ఆ పుష్పవనానికి వెనకగా జారిపోతోన్న సూర్యభగవానుని కిరణకాంతిచ్ఛాయలను ఆభరణములుగా ధరించి మిలమిలా మెరుస్తో, బ్యాండుమేళమును మించిన మధురధ్వనులు పూరిస్తూ, కాలచక్రంవలె వేగంగా, త్రాచుపామువలెనే వంకర్లు వంకర్లుగా తిరిగి ముందుకు తరలిపోతోంది. గులాబీ సౌరభమును వెదజల్లుతూ 'జంయ్' మనే రొదతో చలిగాలి రెల్లుదుబ్బుల సందుల్లోనుంచి దూసుకుపోతోంది. రక్తవస్త్రధారిణియైన ఆకాశం అప్పుడప్పుడే తనలో నీలిమానికి కొంచెం తావొసగుతోంది. ఆరంగు లాకాశాన్ని అందుకోవాలన్నట్లు పక్షులు ఆరాటంతో అల్లరిచేస్తూ ఎత్తుగా ఎగిరిపోతున్నాయి. ఆకసపురంగులు జలప్రవాహంలో ప్రతిబింబిస్తోన్నాయి.

ఆ ప్రకృతి సౌందర్యాన్ని చూచి ఆనందిస్తోన్న వెంకటేశ్వర్లకు, హఠాత్తుగా శిరముపై పిడుగు వాలినట్లయింది. పైనుంచి ఓపల్లెపడుచు, ఓ చెంబో నెత్తిమీది బుట్టను గట్టిగా పట్టుకుని మహా వుత్సాహంగా పాడుకుంటూ వస్తోంది:

'సంక్రాంతి పండగ
సంతోషమైన పండగ
బామ్మణోళ్లు బాగుపడే పండగ
గుడ్డలోళ్లు లాభపడే పండగ
సంక్రాంతి పండగ...'

'అయ్యో! యీగడ్డిదుబ్బుల్లో కూడానా?...' అని అనుకుంటూ నిట్టూర్పు విడిచాడు వెంకటేశ్వర్లు.

# మహావాక్యరత్నాలు

మంచిసంపద ఏదికాని స్నేహితునితో పంచుకోకుండా భోగ్యతరమై వుండదు.

—*Seneca*

* * *

ఒక మనుష్యుడు తన్నుగురించి తాను ఏమనుకుంటాడో అతడు అదే అవుతాడు. మనభావనే మనల్ని దిద్దుతుంది. మన ఆలోచనలే మనము. కాబట్టి బాగా ఆలోచించు.

—*The Rev, E. N, Cotton*

* * *

దేనినైతే తప్పించుకోలేమో దానిని గురించి భయపడడంకాని, విచారించడం కాని కుర్రతనపు బలహీనత అనిపించుకుంటుంది.

—*Shakespeare*

* * *

నీ జీవితాన్ని నీవు నియమబద్ధమొనర్చుకో. ఆమీద ఆ నియమాలే నీ జీవితాన్ని దిద్దుతాయి.

—*St Benedict*

* * *

ఒక్కొక్క సమయంలో అన్నీ తప్పుదారినే పడతాయని మాత్రమే మనకు తెలుసు. జీవితంలో చెడునే చూడ్డమనే తొందరలో మనం ఒక్కొక్క సమయంలో అన్నీ సవ్యంగానూ జరుగుతాయి అనే సంగతిని మరిచిపోతాము.

—*T, B. Priestley*

* * *

మన సందేహాలే మనకు ద్రోహం చేస్తాయి, అవి మనల్ని ఏపని ఆరంభిద్దామన్నా భయపెట్టి మనం సంపాదించగల జయాన్ని మనకు లేకుండా చేస్తాయి.

—*Shahespeare*

* * *

ఓరిమి అనేది విజేతయొక్క ధైర్యసారము. విధినికూడా తట్టుకుని మానవుడు నిలబడగలిగే ఉత్తమగుణ మది.

— *Lytton*

* * *

తప్పులు గడ్డిపరకలలాగున పైనే వుంటాయి. ముత్యాలు వెదుకుదామనుకున్నవారు లోతుకి మునగవలసి వుంటుంది.

—*Dryden*

# ప్రార్థన

ప్రార్థన అనేది ఎవనిచేతగాని కనుగొనబడలేదు. మానవహృదయం యొక్క మొదటి నిట్టూర్పులో, మొదటి దుఃఖంలో, మొదటి సంతోషంలో అది పుట్టువు నొందింది. —*Lamartine*

... ... ...

మనం తరుచుగా అన్నీ ఉడిగాక ఆఖర్ని భగవంతుడి శరణు వేడతాము. అన్యథా శరణంలేదు కాబట్టి అతని శరణు కోరతాము. అప్పుడు మనకు తెలుస్తుంది- జీవితంలో రేగిన తుపాను మనల్ని మనం కోరే స్వర్గానికి కొనిపోయిందని. —*G. Mac Donald*

... ... ...

ఓ, భగవంతుడా! చెడ్డవారిమీద దయపెట్టు. మంచివారిమీద నీవు ఈ వరకే దయపెట్టి వుంచావని నీవు వారిని మంచివారినిగా చేయడంవల్లనే తెలుస్తూ వుంది.

—*Old Persian prayer*